సూర్య నేటి దినపత్రిక www.suryaa.com

# 17వ వసంతంలోకి..

www.suryaa.com


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM www.suryaa.com

బుధవారం

12 జూన్ 2024

పేజీలు: 02




# ఏపీ సీఎంగా చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. చంద్రబాబుతోపాటు పవన్ కళ్యాణ్, మరో 23 మంది నేతలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ, ప్రముఖ నటులు చిరంజీవి, రజినీకాంత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఎల్జేపీ చీఫ్, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, మాజీ గవర్నర్ తమిళిసై, తదితరులు హాజరయ్యారు. కాగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఇది నాలుగోసారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇప్పటికే రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు.. నవ్యాంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావడం ఇది రెండోసారి. 1978లో చంద్రగిరి నుంచి చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1980 నుంచి 1983 వరకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1995లో ఉమ్మడి ఏపీ సీఎంగా తొలిసారిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. 1999లో రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 2014లో నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారు. 2019 నుంచి 2024 వరకు నవ్యాంధ్రలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. నవ్యాంధ్రకు రెండోసారి సీఎంగా నేడు ప్రమాణ స్వీకారం చేశారు. చంద్రబాబు మంత్రివర్గంలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన 10 మందికి చోటు దక్కింది. పవన్‌తోపాటు మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, టీజీ భరత్, ఎస్.సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి తదితరులు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, బీసీ జనార్ధన్ రెడ్డి తదితరులు గతంలో పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కానీ మంత్రివర్గంలో ఎప్పుడూ చోటు దక్కించుకోలేదు. కానీ ఇప్పుడు తొలిసారిగా వీరికి ఆ అవకాశం లభించింది. మొత్తంగా 17 మంది కొత్తవాళ్లు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. జనసేనకు మూడు, బీజేపీకి ఒక స్థానం కల్పించారు. మరో స్థానాన్ని ఖాళీగా ఉంచారు. గత కొన్ని రోజుల నుంచి మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేసిన చంద్రబాబు.. సీనియర్లు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ జాబితాను రూపొందించారు

## నాలుగో సారి ముఖ్యమంత్రిగా..

**28 ఏళ్లకే ఎమ్మెల్యే. 30 ఏళ్లకు మంత్రి. 45 ఏళ్లకు ముఖ్యమంత్రి. తెలుగు రాజకీయాల్లో చంద్రబాబు ట్రాక్ రికార్డు ఇది. 1995లో తొలిసారి సీఎం అయిన చంద్రబాబు.. 13 ఏళ్ల 244 రోజుల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగారు. నేడు నాలుగోసారి సీఎంగా ప్రమాణం చేయబోతున్నారు. బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఆయనకు రాజధాని రూపంలో పెద్ద సవాల్ ముందుంది. దీంతో ఈసారి చంద్రబాబు పాలన మార్క్ ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది.**

## 1995లో తోడల్లుడు.. ఇప్పుడు వదిన



అది 1995 సంవత్సరం.. చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయిన సందర్భం.. తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష నాయకుడిగా చంద్రబాబు పేరును ఆయన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రతిపాదించారు. ఇప్పుడు 2024.. అంటే 29 ఏళ్ల తర్వాత.. చంద్రబాబును ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా బలపరుస్తున్నట్లు దగ్గుబాటి వెంకటేశ్వరరావు సతీమణి, చంద్రబాబు వదిన, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటించారు. మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు తెలుగుదేశం నేతలు ఈ విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

## సీనియర్లకు నిరాశ

మంత్రి పదవులు ఆశించిన పలువురు సీనియర్ నేతలకు నిరాశ ఎదురైంది. వారిలో బుచ్చయ్య చౌదరి, అయ్యన్న, ధూళిపాళ్ల నరేంద్ర, గంటా శ్రీనివాసరావు, యరపతినేని, బొండా ఉమ, గద్దె రామ్మోహన్, బాలకృష్ణ, పరిటాల సునీత, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, జీవీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు. అలాగే జేసీ అస్మిత్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్రంలోనే భారీ మెజార్టీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావుకూ అవకాశం దక్కలేదు.



## కేబినెట్‌లో పిన్న వయస్కురాలిగా అనిత!



చంద్రబాబు కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కురాలిగా వంగలపూడి అనిత (40) నిలిచారు. ఆమె తర్వాత నారా లోకేశ్ (41), కొండపల్లి శ్రీనివాస్ (42), మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి (42) ఉన్నారు. 70 ఏళ్లు దాటిన మంత్రులుగా ఎన్ఎండీ ఫరూక్ (75), చంద్రబాబు (74), ఆనం రామనారాయణరెడ్డి (71) ఉన్నారు. అలాగే 50 నుంచి 70 ఏళ్ల మధ్యలో 15 మంది మంత్రులు ఉన్నారు.

## పవన్ కళ్యాణ్ అనే నేను..

### ఆంధ్రప్రదేశ్ మంత్రిగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రమాణం

### చప్పట్లు, కేకలతో మార్మోగిన సభా ప్రాంగణం

### వేదికపైనే చిరంజీవికి పవన్ పాదాభివందనం

"కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ మంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంత:కరణశుద్ధితో నిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాను" అంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రమాణం చేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ కేసరపల్లి సభావేదికపై పవన్ తో ప్రమాణం చేయించారు.

కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను.. అంటూ పవన్ పలకగానే ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తల సంతోషం మిన్నంటింది. చప్పట్లు, కేకలతో సభా ప్రాంగణం మార్మోగింది. పవన్ ప్రమాణస్వీకారం చేస్తుండగా ఆయన భార్య అన్నా లెజనోవా, సోదరుడు చిరంజీవి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రమాణం పూర్తయ్యాక వేదికపై ఉన్న చంద్రబాబు దగ్గరికి వెళ్లిన పవన్ కల్యాణ్ ఆయనతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా పవన్ ను చంద్రబాబు అభినందించారు. ఆపై వేదికపై ఉన్న గవర్నర్, ఇతర ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి పవన్ కల్యాణ్ నమస్కరించారు. అన్న చిరంజీవికి పాదాభివందనం చేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.



## మెగాస్టార్.. పవర్ స్టార్ ఫ్యాన్స్ పండగ చేసుకునే అద్భుత దృశ్యం..

ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, కొత్త మంత్రులు కలిసి ఫోటో దిగారు. ఆ తరువాత సభా వేదికనుంచి మోదీ దిగిపోయే సమయంలో ప్రధాన వేదికకు పక్కన ఉన్న మరో వేదికపై అతిథులంతా కూర్చుని ఉన్నారు. ఒక్కసారిగా పవన్ కళ్యాణ్ చేయి పట్టుకుని అతిధులు ఉన్న వేదికపైకి మోదీ చేరుకుని.. అక్కడ ఉన్న చిరంజీవి దగ్గరకు వెళ్లారు. ఓవైపు చిరంజీవి.. మరో వైపు పవన్ కళ్యాణ్.. ఉండగా మధ్యలో మోదీ నిల్చుకుని చేతులు పైకెత్తి అందరికీ అభివాదం చేశారు. అంతేకాదు మెగస్టార్ కుటుంబ సభ్యులంతా ఈ దృశ్యాన్ని చూసి ఎమోషనల్ అయ్యారు. చిరంజీవి పవన్ గడ్డం పట్టుకుని నవ్వుతూ పలకరించారు. దీనిని మెగాస్టార్, పవర్ స్టార్ ఫ్యాన్స్ పండుగ చేసుకునే దృశ్యంగా చెప్పుకోవచ్చు.



## చంద్రబాబు నాయుడు

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు

VOTE FOR TELUGU DESAM

**2024 నాల్గోవ సారి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

జననం: 20 ఏప్రిల్ 1950

ప్రాంతం: నారావారిపల్లె, ఆంధ్రప్రదేశ్

వివాహం: నారా భువనేశ్వరి

సంతానం: నారా లోకేష్

చదువు: ఎంఏ

**కుప్పం ఎమ్మెల్యేగా 8సార్లుగా గెలుపు (1989-2024)**

**ఏపీ సీఎంగా 4 సార్లు (1995,1999,2014,2024)**

**రాజకీయ ప్రవేశం**

1975లో కాంగ్రెస్ చేరిక

1978లో చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలుపు

1980లో కాంగ్రెస్ హయాంలో మంత్రిగా

1986లో టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

## ఆంధ్రప్రదేశ్ నూతన కేబినెట్ మంత్రులు

24 మంది మంత్రులతో కూటమి జాబితా విడుదల.. జనసేనకి 3, బీజేపీకి 1

| | | | | | |
|---|---|---|---|---|---|
|  | కొణిదెల పవన్ కళ్యాణ్, జనసేన (కాపు) |  | సత్యకుమార్ యాదవ్, బీజేపీ (బీసీ, యాదవ) |  | గొట్టిపాటి రవి.టీడీపీ (కమ్మ) |
|  | నారా లోకేష్, టీడీపీ (కమ్మ) |  | నిమ్మల రామానాయుడు, టీడీపీ (కాపు) |  | కందుల దుర్గేష్, జనసేన (కాపు) |
|  | కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ (బీసీ, కొప్పుల వెలమ) |  | ఎన్.ఎమ్.డి.ఫరూక్,టీడీపీ (ముస్లిం మైనారిటీ) |  | గుమ్మడి సంధ్యారాణి,టీడీపీ (ఎస్టీ) |
|  | నాదెండ్ల మనోహర్, జనసేన (కమ్మ) |  | ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ (రెడ్డి) |  | బీసీ జనార్ధన్ రెడ్డి,టీడీపీ (రెడ్డి) |
|  | కొల్లు రవీంద్ర, టీడీపీ (బీసీ మత్స్యకార) |  | పయ్యావుల కేశవ్,టీడీపీ (కమ్మ) |  | టీజీ భరత్,టీడీపీ (ఆర్య వైశ్య) |
|  | పి.నారాయణ, టీడీపీ (కాపు) |  | అనగాని సత్యప్రసాద్, టీడీపీ (బీసీ, గౌడ) |  | ఎస్.సవితమ్మ,టీడీపీ (కురబ) |
|  | వంగలపూడి అనిత, టీడీపీ (ఎస్సీ మాదిగ) |  | కొలుసు పార్థసారథి, టీడీపీ (బీసీ, యాదవ) |  | వాసంశెట్టి సుభాష్,టీడీపీ (బీసీ, శెట్టిబలిజ) |
|  | బాలవీరాంజనేయస్వామి. టీడీపీ (ఎస్సీ మాల) |  | కొండపల్లి శ్రీనివాస్,టీడీపీ (బీసీ తూర్పు కాపు) |  | మండిపల్లి రామ్ ప్రసాద్,టీడీపీ (రెడ్డి) |



## పవన్ కళ్యాణ్

జనసేన అధ్యక్షుడు

VOTE FOR GLASS

**2024 లో ఆంధ్రప్రదేశ్ డిప్యూటి సీఎం**

జననం: 2 సెప్టెంబర్ 1970లో జననం

అడ్రస్: బాపట్ల, ఆంధ్రప్రదేశ్

వివాహం: భార్య అన్నా లెజినోవా

సంతానం: నలుగురు

చదువు: పదవ తరగతి

**రాజకీయ ప్రవేశం**

2008 ప్రజారాజ్యం పార్టీతో రాజకీయం ప్రవేశం

**జనసేన పార్టీ**

14 మార్చి 2014న హైదరాబాద్‌లో స్థాపన చేశారు.

**2019 ఎన్నికలో..**

ఎమ్మెల్యేగా గాజువాక, భీమవరంలో ఓటమి

**2024లో కూటమితో కలిసి**

బీజేపీ,టీడీపీతో కలిసి కూటమి ఏర్పాటు చేశారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ఉత్తరాఖండ్‌లో లోయలో పడ్డ బస్సు ..

**ముగ్గురు మహిళలు మృతి, 24 మందికి గాయాలు**

ఉత్తరాఖండ్‌లో ఓ బస్సు ప్రమాదానికి గురైంది. గంగోత్రి జాతీయ హైవేపై ఉన్న గంగనాని వద్ద బస్సు లోయలో పడింది. డ్రైవర్ కంట్రోల్ కోల్పోవడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతిచెందారు. మరో 24 మంది గాయపడ్డారు. గంగనానికి 50 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారు. కంట్రోల్ తప్పిన డ్రైవర్.. వాహనాన్ని క్రాష్ బారియర్లకు ఢీకొట్టాడు. లోయలో పడి ఓ చెట్టుపై ఆగిపోయింది. గంగోత్రి నుంచి ఉత్తరకాశీ వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఆ టైంలో ఆ బస్సులో 27 మంది ప్రయాణికులు ఉన్నారు. సరైన సమయంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడ్డవారిని ఉత్తరకాశీ జిల్లా ఆస్పత్రి, భట్వాడి హెల్త్ సెంటర్‌కు తరలించారు.




## పద్నాలుగేళ్ల క్రితం ఇదే రోజు..!

టీమ్ ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ T20ల్లోకి ఎంట్రీ ఇచ్చి నేటితో పద్నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన భారత్ తరఫున 119 T20లు ఆడారు. అత్యధిక పరుగులు (4,042), అత్యధిక ఫిఫ్టీలు (37), అత్యధిక మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు (15), సిరీస్‌లు (7), వరల్డ్ కప్‌లో అత్యధిక రన్స్ (1146), వరల్డ్ కప్‌లో అత్యధిక అర్ధ సెంచరీలు (14), WCలో అత్యధిక మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు, సిరీస్‌లు కూడా ఆయన ఖాతాలోనే ఉన్నాయి.




## రికార్డు సృష్టించిన పాక్ బౌలర్ హరీస్ రౌఫ్

అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన ఫాస్ట్ బౌలర్‌గా పాకిస్థాన్ ప్లేయర్ హరీస్ రౌఫ్ రికార్డు సృష్టించారు. 69 ఇన్నింగ్స్‌లో (71 మ్యాచులు) ఆయన ఈ ఘనతను అందుకున్నారు. కాగా స్పిన్నర్లు రషీద్ ఖాన్ 53 మ్యాచులు, హసరంగా 63 మ్యాచుల్లోనే ఈ ఫీట్ సాధించారు. నిన్న కెనడాతో జరిగిన మ్యాచులో రౌఫ్ 2 వికెట్లు పడగొట్టారు.



## సరికొత్త గరిష్ఠాలకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్లలో నిఫ్టీ 23,440 మార్క్ తాకి సరికొత్త గరిష్ఠాలను నమోదు చేసింది. ప్రస్తుతం 162 పాయింట్ల లాభంతో 23427 వద్ద ట్రేడవుతోంది. మరోవైపు సెన్సెక్స్ సైతం 550 పాయింట్లకుపైగా లాభపడి మరోసారి 77వేల మార్క్ చేరుకుంది. దీంతో ఇన్వెస్టర్ల సంపద రూ.2.8లక్షల కోట్లు పెరిగింది. బ్యాంక్, ఐటీ స్టాక్స్ లాభాల్లో దూసుకెళ్లడం మార్కెట్లకు కలిసొచ్చింది.

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్




తెలంగాణ టెట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం తెలంగాణ టెట్ ఫలితాలను విడుదల చేశారు. టెట్-2024కు 2,86,381 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షకు 85,996 అభ్యర్థులు హాజరుకాగా.. 57,725 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పేపర్-2 పరీక్షకు 1,50,491 అభ్యర్థులు హాజరుకాగా.. 51,443 అభ్యర్థులు అర్హత సాధించారు. పేపర్-1లో 67.13 శాతం మంది అర్హత సాధించారు. పేపర్-2లో 34.18 శాతం అర్హత సాధించారు.

# పార్లమెంట్ సమావేశాలు జూన్ 24 నుంచి

కేంద్రంలో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుతీరింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాల్లో విజయం సాధించింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 272 మార్క్ దాటాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలను కలుపుకుని బీజేపీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా, కేబినెట్ సభ్యులు, సహాయ మంత్రులు ప్రమాణం స్వీకారం చేశారు. వారికి శాఖల కేటాయింపు సైతం పూర్తయింది. ఇక, లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా జూన్ 24 నుంచి జులై 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక ఎనిమిది రోజులపాటు కొనసాగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జూన్ 24 నుంచి 25 ఈ రెండు రోజుల పాటు కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎంపిక జరగనుంది.



స్పీకర్ రేసులో ఎవరున్నారంటే? రాజస్థాన్ కోట లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ నేత ఓం బిర్లా 2019 నుంచి 2024 వరకు లోక్‌సభకు 17వ స్పీకర్‌గా పనిచేశారు. అయితే ఇటీవల సాధారణ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో లోక్‌సభకు 18వ స్పీకర్ ఎవరనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే వరుసగా రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన ఓం బిర్లా స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్లమెంట్ సభ్యులను లోక్‌సభ స్పీకర్‌గా ఎంపిక చేసే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ లోక్‌సభ స్పీకర్ పదవి కోసం టీడీపీ,ఏపీ బీజేపీ, జేడీయూ పోటీపడుతున్నాయి.

# తమిళిసైపై అమిత్ షా సీరియస్..

### చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంలో ...

చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమ వేదికపై ఆసక్తికర ఘటన ఒకటి చోటు చేసుకుంది. బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆ పార్టీ మహిళా నేత తమిళిసై సౌందరరాజన్ మధ్య జరిగిన సన్నివేశమది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మాజీ గవర్నర్, తమిళనాడు బీజేపీ నేత తమిళిసై సౌందరరాజన్ కూడా హాజరయ్యారు. అక్కడే వేదిక మీద ఉన్న బీజేపీ పెద్దలకు నమస్కారం చేసి ముందుకు వెళ్లబోయారు. అయితే.. కేంద్ర మంత్రి అమిత్ షా ఆమెను వెనక్కి పిలిచారు. ఒక్కసారిగా ఆమెపై సీరియస్ అయ్యారు. తమిళిసై ఏదో చెప్పబోతుండగా.. అడ్డుకుని మరీ అమిత్ షా ఆమెను ఏదో వారించినట్లు ఉంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమిళిసైకి, కేంద్ర మంత్రి అమిత్ షాకి మధ్య అసలు ఏం జరిగింది?. ఆమెపై కేంద్రమంత్రి అమిత్ షా ఎందుకు అంత సీరియస్ అయ్యారని షోషల్‌మీడియాలో చర్చ



జరుగుతోంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో బీజేపీ పేలవమైన ప్రదర్శన ఇచ్చింది. బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలైతో పాటు తమిళిసై కూడా ఓటమి పాలయ్యారు. ఆ వెంటనే ఆమె అన్నామలైకి వ్యతిరేకంగా స్టేట్‌మెంట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పంచాయితీలు పెట్టొద్దంటూ ఆమెను వారించి ఉంటారని పలువురు కామెంట్లు చేస్తున్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తేనే అసలేం జరిగిందనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## భద్రత విధుల నుంచి తప్పుకోనున్న 'బ్లాక్ క్యాట్'

దేశంలోని ప్రముఖుల భద్రత తీరుతెన్నులను కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన మోదీ ప్రభుత్వం సమీక్షించనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడినట్లు, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తగిన కసరత్తు చేపడుతోందని పేర్కొన్నాయి. ఇప్పటివరకూ వీఐపీలకు వ్యక్తిగత భద్రత విధుల్లో ఉన్న ఎన్ఎస్‌జీ కమెండోలతోపాటు ఐటీబీపీ సిబ్బందినీ ఉపసంహరించనున్నారు. 'జడ్' విభాగంలోని తొమ్మిది కేటగిరీల్లో ఉన్న వారి రక్షణ బాధ్యతలను సీఆర్పీఎఫ్‌కు లేదా సీఐఎస్ఎఫ్‌లోని స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్(ఎస్ఎస్‌జీ)కు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఉగ్రదాడులు, విపత్తుల సందర్భంగా 'స్ట్రైక్ ఫోర్స్'గా వినియోగించుకునేందుకు 1984లో ఎన్ఎస్‌జీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆచరణ మాత్రం అందుకు భిన్నంగా ఉండటంతో బ్లాక్ క్యాట్ కమెండోలను వీఐపీల బాధ్యతల నుంచి తప్పించాలని 2012లోనే ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ముఖ్యుల భద్రతలో 450 మంది వరకు బ్లాక్‌క్యాట్ కమెండోలో ఉన్నారని సమాచారం. వారిని ఆ విధుల నుంచి ఉపసంహరించుకున్నాక.. దేశంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బృందాల వారీగా మోహరించనున్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో నాలుగేళ్ల చిన్నారికి బర్డ్ ఫ్లూ..

**2019 తర్వాత రెండో కేసు**

సాధారణంగా పక్షులకు సంక్రమించే బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రస్తుతం మానవుల్లో కూడా కనిపిస్తోంది. ఇప్పటికే భారత్ (2019లో తొలి కేసు), చైనా, మెక్సికో వంటి దేశాల్లో ఇలాంటి కేసులు వెలుగు చూసిన విషయం తెలిసిందే. తాజాగా దేశంలో మరోసారి బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. భారత్‌లో 2019 తర్వాత రెండో బర్డ్ ఫ్లూ కేసు నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ మంగళవారం వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నాలుగేళ్ల చిన్నారి హెచ్9ఎన్2 రకం వైరస్ బారిన పడినట్లు తెలిపింది. తీవ్రమైన శ్వాసకోశ సమస్య, అధిక జ్వరం, పొత్తికడుపు తిమ్మిరి వంటి సమస్యలతో చిన్నారి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరినట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. చికిత్స తర్వాత మూడు నెలల తర్వాత డిశ్చార్జ్ అయినట్లు వెల్లడించింది. చిన్నారి ఇంటి పరిసరాల్లో కోళ్లు ఎక్కువగా ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. చిన్నారి కుటుంబ సభ్యులు ఎవరికీ ఈ వ్యాధి సంబంధిత లక్షణాలు లేవని వెల్లడించింది. హెచ్9ఎన్2 వైరస్ వ్యాధి లక్షణాల తీవ్రత ఓ మోస్తరుగా ఉంటుందని తెలిపింది. కాగా, భారత్‌లో మనుషుల్లో తొలి బర్డ్‌ఫ్లూ కేసు 2019లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. తాజా కేసు రెండోదికావడం గమనార్హం.






## పెరిగిన ఆర్టీసీ టికెట్ ధరలు!

టోల్ ప్లాజాలున్న మార్గాల్లో నడిచే బస్సుల్లో టికెట్ ఛార్జీలోని టోల్ రుసుమును RTC ₹3 చొప్పున పెంచింది. కేంద్రం ఇటీవల టోల్ ఛార్జీలు పెంచడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్స్‌ప్రెస్‌లో ₹10 నుంచి ₹13కు, డీలక్స్, లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర బస్సుల్లో ₹13 నుంచి ₹16కు, గరుడ ప్లస్‌లో ₹14 నుంచి ₹17కు, నాన్ ఏసీ స్లీపర్, హైబ్రిడ్ స్లీపర్‌లో ₹15 నుంచి ₹18కి, AC స్లీపర్‌లో ₹20 నుంచి ₹23కు పెంచింది.



## డీఎస్సీ దరఖాస్తు గడువు పొడిగింపు

టెట్‌లో కొత్తగా ఉత్తీర్ణులైన వారికి డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నేడు టెట్ ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో డీఎస్సీ దరఖాస్తు గడువును ఈనెల 20 వరకు పొడిగించింది. ఇప్పటివరకు దాదాపు 2.35 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించే ఈ పరీక్షలు జులై 17 నుంచి 31 వరకు జరగనున్నాయి.



## తెలంగాణలో 3 రోజులు భారీ వర్షాలు

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వానలు పడుతున్నాయి. ఇవాళ్టి నుంచి మరో 3 రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ ఆదిలాబాద్, నిర్మల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, సిద్దిపేట, యాదాద్రి, మేడ్చల్ జిల్లాల్లో వానలు పడతాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతోపాటు 30-40Kmph వేగంతో ఈదురుగాలులు వీస్తాయంది.

## ఐపీఓల ట్రెండ్ షురూ!

దేశీయ మార్కెట్లలో మళ్లీ ఐపీఓ ట్రెండ్ మొదలైంది. రెండు నెలల్లో దాదాపు 30 కంపెనీల ఐపీఓలు అందుబాటులోకి రానున్నాయి. వీటితో రూ.30వేల కోట్లకుపైగా సమకూరనుందని అంచనా. ఇక మరో 37 కంపెనీలు సెబీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఈ సంస్థలు ఐపీఓలతో రూ.50వేలకోట్లు రాబట్టాలని ఆశిస్తున్నాయి. కాగా కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక వచ్చిన తొలి ఐపీఓగా నిలిచిన ఇక్సిగోకు మంచి ఆదరణ లభిస్తోంది. నేడు ఇక్సిగో ఐపీఓకు చివరి తేదీ.




## నేడు USతో భారత్ ఢీ.. గెలిస్తే సూపర్-8 బెర్త్

గ్రూప్-Aలో అజేయంగా ఉన్న భారత్-అమెరికా మధ్య నేడు మ్యాచ్ జరగనుంది. హ్యాట్రిక్ విజయంపై ఇరు జట్లూ గురిపెట్టాయి. కెనడా, పాకిస్థాన్‌పై US గెలిచినప్పటికీ సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్ సేన ముందు నిలబడటం కష్టమే. ఇవాళ విజయం సాధించిన జట్టు గ్రూప్-8 బెర్త్‌ను ఖాయం చేసుకుంటుంది. రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం వీక్షించవచ్చు.